



బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

» మేడ్చల్‌లో ఘటన

మేడ్చల్‌టౌన్, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి) : హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని బీటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన మేడ్చల్‌లో చోటు చేసుకుంది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన సిద్ధార్థ యాదవ్(19) అలియాస్ సిద్దు మేడ్చల్ పట్టణం ఉమానగర్‌లోని వీబీపీ బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ కిష్టాపూర్‌లోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాలలో ఐటీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. దసరాకు ఇంటికి వెళ్లిన సిద్దు సోమవారం సాయంత్రం హాస్టల్‌కు తిరిగి వచ్చాడు. మంగళవారం ఉదయం తోటి రూమ్‌మెంట్స్ కళాశాలకు వెళ్లగా, సిద్దు మాత్రం తర్వాత వస్తానంటూ రూంలోనే ఉండిపోయాడు. రూమ్‌మెంట్స్‌లు తిరిగి సాయంత్రం హాస్టల్‌కు చేరుకుని రూమ్ వద్దకు వెళ్లి తలుపు తట్టగా సిద్దు తెరవలేదు. హాస్టల్ నిర్వాహకులు తలుపులు బద్దలు కొట్టి చూడగా సిద్దు ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయాడు. దీంతో నిర్వాహకులు సమాచారమివ్వగా ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహాన్ని కిందికి దింపి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. కాగా తన చావుకు ఎవరూ కారకులు కారని, సిద్దు ఫోన్‌లో మెసేజ్ పెట్టినట్టు పోలీసులు తెలిపారు. మృతుడి ఫోన్‌లో పలు ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లు డౌన్‌లోడ్ చేసి ఉన్నందున ఆ కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

అప్‌గ్రేడ్ చేసిన ఆస్పత్రులు	09
ఉండాల్సిన సిబ్బంది	333
ప్రస్తుత సిబ్బంది	236
ఖాళీలు	97



రేకుల షెడ్డులో కొనసాగుతున్న ఆమనగల్లు ప్రభుత్వ ఆస్పత్రి

ఉమ్మడి జిల్లాలో ఏ ప్రభుత్వ ఆస్పత్రి చూసినా ఏమున్నది గర్వకారణం అన్న పరిస్థితి నెలకొంది. ఆస్పత్రులను అప్‌గ్రేడ్ చేసినా వసతులు, సిబ్బంది ఏర్పాటును మరిచారు. వేధిస్తున్న సిబ్బంది, వైద్యుల కొరతతో సకాలంలో వైద్యం అందక పేద ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. స్థాయి పెరిగిన తొమ్మిది ఆస్పత్రుల్లో మొత్తం 333 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా కేవలం 236 మంది మాత్రమే ఉన్నారు. కమ్యూనిటీ ఆస్పత్రులు ఏరియా ఆస్పత్రులుగా మారినా వసతుల లేమి వెక్కిరిస్తోంది. నిధులు మంజూరైనా పలు చోట్ల ఆస్పత్రుల భవన నిర్మాణాలు ప్రారంభం కాని దుస్థితి. చాలా చోట్ల గైనకాలజిస్టులు లేక గర్భిణులు ప్రైవేట్‌కు పరుగులు తీస్తున్నారు.

అప్‌గ్రేడ్ సరే.. వసతులేవి?

ఆస్పత్రుల స్థాయి పెంచినా సౌకర్యాలు నిల్



షాద్‌నగర్ ఆస్పత్రిలో రోగుల కిటకిట

- వేధిస్తున్న వైద్యులు, సిబ్బంది కొరత
- అందుబాటులో లేని గైనకాలజిస్టులు
- గర్భిణులకు స్కానింగ్ కష్టాలు.. ప్రైవేట్‌కు పరుగులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు
- చేవెళ్ల ఆస్పత్రిలో నిరుపయోగంగా ఆక్సిజన్ ప్లాంట్
- నిధులున్నా ప్రారంభం కాని ఆస్పత్రి నిర్మాణాలు
- అప్‌గ్రేడ్ చేసిన ఆస్పత్రుల్లో సిబ్బంది కొరత, వైద్యం అందుతున్న తీరుపై ప్రత్యేక కథనం

ఉమ్మడి జిల్లా నెట్‌వర్క్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల స్థాయి పెంచినా వైద్య సిబ్బంది ఉన్న చోట సౌకర్యాలు లేవు.. సౌకర్యాలు ఉన్న చోట సిబ్బంది కొరత వేధిస్తుంది. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి ప్రాంతీయ ఆస్పత్రి స్థాయికి ఎదిగినా ఆ మేరకు సిబ్బంది కనిపించని దుస్థితి. 100 పడకల సామర్థ్యం ఎక్కడా కనిపించడం లేదు. కమ్యూనిటీ ఆస్పత్రులను ఏరియా ఆసుపత్రులుగా అప్‌గ్రేడ్ చేసినా అది అగితాలకే పరిమితమైంది. కొత్త ఆసుపత్రి భవనాల నిర్మాణం కోసం రూ.కోట్లు మంజూరైనా స్థల సేకరణ జరగక నిధులు మూలుగుతున్నాయి. గైనకాలజిస్టులు అందుబాటులో లేక నార్మల్ డెలివరీల సంఖ్య భారీగా తగ్గింది. అల్ట్రాసౌండ్ మిషన్ లేక పోవడంతో హైదరాబాద్‌కు పరుగులు పెడుతున్నారు. ఒక వేళ స్కానింగ్ మిషన్ ఉంటే.. రేడియాలజిస్టు

మిగతా 7వ పేజీలో...



పిడుగుపాటుకు చనిపోయిన గొర్రెలు

పిడుగుపడి గొర్రెల మృతి

కులకచర/బొంరాస్‌పేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. బొంరాస్‌పేట్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వర్షం కురిసింది. కంది పంట సాగు చేసిన రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కులకచర్ల మండలంలోని సాల్విడ్ గ్రామంలో మంగళవారం పిడుగు పాటుకు రెండు గొర్రెలు మృతి చెందాయి. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గ్రామానికి చెందిన అంజిలయ్య తన గొర్రెలను పొలం దగ్గర చెట్టు కింద నిలపగా పిడుగు పడి రెండు గొర్రెలు మృతి చెందాయి.



ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

శామీర్‌పేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శామీర్‌పేటలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టగా శామీర్‌పేటకు చెందిన కుమావత్ విష్ణు- కాంతాదేవి దంపతులు, వారి కుటుంబసభ్యులు దాతలుగా ముందుకు వచ్చి 125 కేజీల బియ్యం అందజేశారు. ఘనాపూర్‌లోని శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

మున్సిపాలిటీలపై ఆర్థిక భారం

గుదిబండలా పంచాయతీల విలీనం

- ఇళ్ల అనుమతుల నిలిపివేత
- తగ్గిన మున్సిపాలిటీ ఆదాయం
- కుదేలవుతున్న నాగారం బల్దియా



8



సమస్యలను పరిష్కరించాలి

డీఏ, పీఆర్‌సీను విడుదల చేయాలి

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

8

అంగన్‌వాడీల్లో వసతులు కల్పించాలి

అడిషనల్ కలెక్టర్ సుధీర్

- తాండూరు మండలంలో పర్యటన
- కేంద్రాల్లో వసతులపై అసంతృప్తి.. రోడ్ల నాణ్యత పరిశీలన

7





బల్దియాలో కలపొద్దు

అందని సంక్షేమ పథకాలు

నస్కల్ గ్రామస్తుల నిరసన.. ఎమ్మెల్యేకు వినతి

8

అప్పిచ్చి అవస్థలు

- మేడ్చల్ ఏఎంసీకి రూ.11.60 కోట్ల బకాయిలు
- కొత్త పాలకవర్గానికి రికవరీ సవాళ్లు
- సొంత భవనానికీ నోచుకోని మార్కెట్ కమిటీ



మేడ్చల్ టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కోట్ల రూపాయల ఆదాయం ఉన్నా మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మేడ్చల్ ఏఎంసీ ఇచ్చిన అప్పులు రూ.కోట్లలో ఉన్నాయి. వాటి వసూలు నూతన పాలకవర్గానికి సవాల్‌గా మారింది. మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఏటా రూ.3 నుంచి 4కోట్ల ఆదాయం ఉంటుంది. ఈ ఆదాయంతో మార్కెట్ కమిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చాల్సి ఉండగా, ఈ డబ్బులను ఇతర మార్కెట్ కమిటీలకు అప్పుగా ఇచ్చింది. అప్పులు తిరిగి రాకపోవడంతో ఏఎంసీ అధికారులు తలపట్టుకుంటున్నారు. 2014 నుంచి మేడ్చల్ ఏఎంసీ రాష్ట్రంలోని పలు ఏఎంసీల అభివృద్ధికి 5.90కోట్ల వరకు అప్పిచ్చింది. 2024 నాటికి అప్పుల రికవరీ కాలేదు. అవి వడ్డీతో సహా రూ.11.60కోట్ల వరకు రావాల్సి ఉంది. వాటి వసూళ్లకు

మిగతా 8వ పేజీలో...


ధాన్యం సేకరణకు జాగ్రత్తలు తీసుకోవాలి

» కలెక్టర్ ప్రతీక్ జైన్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం సేకరణకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వానాకాలం ధాన్యం కొనుగోలుపై సన్నాహక, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ మద్దతు ధరతో పాటు, సన్నరకానికి క్వింటాల్‌కు అదనంగా రూ.500 చెల్లించడం జరుగుతుందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డు ధాన్యం సేకరణకు వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో మొత్తం 130 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా, అందులో 18 సన్నరకం కొనుగోలు కేంద్రాలు, మిగతావి దొడ్డు రకం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కేంద్రాల వద్ద తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కేంద్రాల్లో వ్యవసాయ , పౌరసఫరాల అధికారులు సమన్వయంతో ధాన్యం సేకరణ సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీసీఎస్‌వో మోహన్‌బాబు, డీఎంసీఎస్ విజయలక్ష్మీ, వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రెడ్డి, మార్కెటింగ్ అధికారి సారంగా పాణి, డీసీఓ నాగలింగాచారి, కొనుగోలు కేంద్రాల నిర్వహకులు, ఐకేపీ సభ్యులు పాల్గొన్నారు.



కార్విచెడ్‌లో నాపరాయితో ఏర్పాటు చేసిన పాతకాలం నాటి ముఖద్వారం


నాపరాయిది చెదరని చరిత్ర

పునాది నుంచి సమాధి దాక రాతి కట్టడాలే

- దశాబ్దాలుగా ఈ కట్టడాలకు తగ్గని ఆదరణ
- నేటికీ పల్లెల్లో నాపరాయితోనే ఇళ్లు, ఇతర నిర్మాణాలు
- తాండూరులో ఏళ్లు గడిచినా చెక్కుచెదరని కట్టడాలెన్నో..

7

రాతి కట్టడాలు అనగానే టక్కున గుర్తుకొచ్చేది తెలంగాణ - కర్ణాటక సరిహద్దులోని తాండూరు. ఈ ప్రాంతం నాపరాతి గనులు, రాతి కట్టడాలకు ప్రత్యేకం. దశాబ్దాల నుంచి ఈ ప్రాంతంలో నాపరాయితోనే నిర్మాణాలు చేపడుతున్నారు. ఇళ్లు, గుళ్లు, కోటలు, బురుజులు, గ్రామాల ముఖద్వారాలు, మసీదులు, సమాధులు ఇలా ఏ నిర్మాణాలైనా నాపరాళ్లతో నిర్మించినవే..



వెరసి అవి నేటికీ చెక్కు చెదరకుండా చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా నిలిచాయి. తాండూరు ప్రాంతంలో నాపరాతి నిక్షేపాలు, వాటి వినియోగంపై ప్రత్యేక కథనం.

-బషీరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి)



కడా కార్యాలయంలో మాట్లాడుతున్న ఆకునూరి మురళి

విద్యావ్యవస్థలో మార్పులకు శ్రీకారం

» విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

కొడంగల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పుల శ్రీకారానికి చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. మంగళవారం కొడంగల్ పట్టణంలోని కడా కార్యాలయంలో విద్యా కమిషన్ సభ్యులు విశ్వేశ్వరరావు, సీహెచ్.వెంకటేశ్, కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి పూర్వప్రాథమిక, ఉన్నత విద్యపై సమీక్షించారు. ప్రతీ పాఠశాలలో ఇంగ్లీష్ బోధనను ఆచరణలో పెట్టాలని, పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధనకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై చర్చించారు. ప్రతీ పాఠశాల ఆవరణలో ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా కార్పోరేట్ స్థాయిలో బలోపేతానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పిల్లల సమగ్ర అభివృద్ధికి పూర్వప్రాథమిక పాఠశాలలే కీలకమన్నారు. అనంతరం కొడంగల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల, బాలుర పాఠశాలలను అధికారులతో కలిసి సందర్శించారు. ఈ కార్యక్రమంలో డీఈవో రేణుకాదేవి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గీతాంజలి కళాశాలను సందర్శించిన సీపీ సుధీర్‌బాబు

రెండో రోజూ ప్రశాంతం

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్-1 మెయిన్స్ రెండో రోజూ ప్రశాంతంగా జరిగాయి. ఘట్‌కేసర్ పరిధిలో ఏడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 4,416 మంది అభ్యర్థులను గాను 3,346 మంది హాజరుకాగా, 1,070మంది గైర్హాజరయ్యారు. కేంద్రాలవద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించారు. వరంగల్-హైదారాబాద్ జాతీయరహదారి విజయపురి కాలనీ నుంచి చౌదరిగూడ ప్రిన్స్టన్ కళాశాల

మిగతా 8వ పేజీలో...

అంతారం, మోమిన్‌కలాన్ గ్రామాలను సందర్శించిన డీటీ

ధారూరు: అంతారం, మోమిన్‌కలాన్ గ్రామాలను మంగళవారం మండల డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ సందర్శించారు. అంతారం, మోమిన్‌కలాన్ గ్రామాల్లో పాఠశాలలను పరిశీలించారు.

కొమురం భీమ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

పరిగి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కొమురంభీం ఆశయ సాధనకు కృషి చేయాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్ అన్నారు. పరిగిలో మంగళవారం కొమురంభీమ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు అనిల్‌నాయక్, బాలకృష్ణ, అంబర్‌సింగ్, తులసిరాం, లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కొమురం భీం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన

తాండూరు రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధి గౌతాపూర్‌లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై అధికారులు చర్యలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి ఫక్రుద్దీన్, రవి బృందం మంగళవారం సర్వే నంబర్-101, 103, 104, 107, 109, 150, 61, 62, 55/1, 55/2 సర్వే నంబర్లలోని ప్లాట్లను పరిశీలించారు. గౌతాపూర్ పంచాయతీ కింద 1,459మంది ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారని, లేఅవుట్ల కోసం 16దరఖాస్తులొచ్చాయని కార్యదర్శి తెలిపారు. నిబంధనల మేరకు ఉన్న వాటికే ఎల్‌ఆర్‌ఎస్ అప్రూవ్ అవుతుందన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం రూ.వెయ్యి కట్టి రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు నవంబరు 9వ తేదీ కల్లా మిగితా డబ్బులు చెల్లించి రెగ్యులరైజ్ చేసుకోవాలన్నారు. వెంచర్లలో అనుమతుల మేరకు పంచాయతీకి జాగా వదలాలన్నారు. మెయిన్ రోడ్డు 40ఫీట్లు, అంతర్గత రోడ్లు 25ఫీట్ల వెడల్పు ఉండాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని చెప్పారు.

సెక్యూరిటీ కంపెనీలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జీ4ఎస్ సెక్యూరిటీ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పనాధికారి షేక్ అబ్దుస్ సుభాన్ మంగళవారం పేర్కొన్నారు. జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం, ఐటీఐ క్యాంపస్‌లో అక్టోబరు 24న ఉదయం 10.30గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహిస్తామని తెలిపారు. జీ4ఎస్ కంపెనీలో 100 వరకు సెక్యూరిటీ గార్డులు, ఎస్కార్ట్ గార్డ్ పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు. వీటికి పురుషులు మాత్రమే కావాలని, అలాగే నైట్‌షిఫ్ట్ విధులు నిర్వహిస్తామని తెలిపారు. వేతనం రూ.17వేల నుంచి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు బియాసాబ్ మొబైల్ నం: 9676047444కు సంప్రదించాలని కోరారు.

తిరుమలపై రాజకీయం తగదు


మాట్లాడుతున్న బక్కని

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పవిత్ర తిరుమల తిరుపతి దేవస్థానంపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి రాజకీయం చేయడం తగదని టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు అన్నారు. 'చంద్రబాబు ఒక కన్నును పొడుచుకున్నారా?' శీర్షికన ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన వార్తపై బక్కని నర్సింహులు స్పందిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. టీటీడీ బోర్డు స్వయం ప్రతిపత్తి సంస్థ అని, భక్తుల కోసం తీసుకునే నిర్ణయాల్లో ప్రభుత్వ జోక్యం ఉండదన్నారు. తప్పులు సరిదిద్దే క్రమంలోనే ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖల దర్శనాలను నిలిపివేశారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ వారు తెలంగాణాలో వ్యాపారం చేయడంలేదా? వారు తెలంగాణకు రారా? అంటూ చం ద్రబాబుపై అనిరుధ్‌రెడ్డి విమర్శలు చేయడం సరికాదన్నారు. ఉద్యోగాలు, ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకే కాదు, దేశవిదేశాలకూ వెళ్తారన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య విభేదాలు సృష్టించేలా మాట్లాడే నాయకులను అదుపుచేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఈ సందర్భంగా నర్సింహులు కోరారు.

నేటి నుంచి పెద్ద ఉమ్మెంతాల్ తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాలు



పూడూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధి చారిత్రక పెద్ద ఉమ్మెంతాల్‌లో గల తిరుమలనాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ మంగళవారం పేర్కొంది. మంగళవారం ధ్వజారోహణం, ఎదుర్కోళ్ల కార్యక్రమం నిర్వహించారు. నేడు గీతాయజ్ఞం, గురువారం ఉదయం 4గంటల నుంచి రథోత్సవం, శుక్రవారం ఉదయం పూల వసంతోత్సవం, రాత్రి 11గంటల నుంచి స్వామివారికి ఏకాంత సేవ కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి


కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సురేష్

యాచారం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా నివారణకు ప్రజలంతా భాగస్వాములు కావాలని, మహిళలు విద్యావంతులైతేనే మానవ అక్రమ రవాణాను పూర్తిగా నిర్మూలించడం సాధ్యం అని ప్రజ్వల సచ్ఛంద సంస్థ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం యాచారంలో మానవ అక్రమ రవాణా నివారణపై అంగన్‌వాడీ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరి స్వార్థానికి ఎంతో మంది అమ్మాయిల జీవితాలను పాడుచేసే దుండగులను రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అంగన్‌వాడీ టీచర్లు ఈ విషయంపై అవగాహన కల్పించాలన్నారు. సైబర్‌ట్రాకింగ్ వేగంగా విస్తరిస్తోందని, దీన్ని గమనించి సెల్‌ఫోన్ వినియోగంతో కలుగుతున్న నష్టాలను పిల్లలకు వివరించాలని చెప్పారు. ప్రేమ పెళ్లిళ్లు, సినిమాల కారణంగా మహిళలు మోసాలకు గురవుతున్నారని, మానవ అక్రమ రవాణా నిర్మూలనకు, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా ప్రజ్వల సంస్థ 28ఏళ్లుగా పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలో 28,600 మంది అమ్మాయిలను అక్రమ రవాణా నుంచి కాపాడి పునరావాసం కల్పించామని తెలిపారు. ప్రభుత్వ శాఖల సహకారంతో అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణిస్తున్నట్లు చెప్పారు. మోసాలకు గురైన వారికి ప్రభుత్వం పునరావాసం కల్పిస్తోందని ఐసీడీఎస్ ఇబ్రహీంపట్నం ఇన్‌చార్జి సీడీపీవో తులసి అన్నారు. సమావేశంలో సంస్థ అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ మిథాలిరాజ్, పాల్గొన్నారు.

కుల గణనకు సన్నాహాలు

మేడ్చల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సమగ్ర సామాజికవర్గ(కుల) గణనకు ప్రభుత్వం ఆదేశాలివ్వడతో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అధికారులు కుల గణనకు సన్నాహాలు చేస్తున్నారు. జనాభా ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఇతర వర్గాలకు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ పదవుల్లో అవకాశాలు కల్పించేందుకు కుల గణన చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. సామాజిక స్థితిగతులు, ఆర్థిక పరిస్థితి తదితరాంశాలపై సమగ్ర సమాచార సేకరణకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

అన్నింటికీ అవసరమే..

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా కుల గణనకు హామీ ఇచ్చింది. ఉద్యోగాల్లో బీసీలకు 20శాతం, స్థానిక సంస్థల్లోని రాజకీయ పదవుల్లో 34శాతం రిజర్వేషన్లు కల్పించాలని, బీసీ జనాభా గణన లెక్కించాలని డిమాండ్లు వస్తున్నాయి. గతంలో పోలిస్తే ఓసీ జనాభా తగ్గి బీసీలు పెరిగినట్లు అంచనాలు వేస్తున్నారు. కుల గణన చేస్తేనే పథకాల రూపకల్పనకు ఉపయోగపడుతుంది. సర్పంచ్, ఇతర స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లకూ ఇది ప్రామాణికం కానుంది.

సిబ్బంది నియామకానికి కసరత్తు

జిల్లాలో ఇంటింటి సర్వేకు సిబ్బంది(ఎన్యూమరేటర్లు) ఎంత మంది అవసరమో అధికారులు అంచనా వేస్తున్నారు. 80రోజుల్లో కుల గణన పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో అధికారులు అందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ శాఖల్లోని సిబ్బంది వివరాలను సేకరిస్తున్నారు.

నాపరాయిది చెదరని చరిత్ర

- పునాది నుంచి సమాధి దాకా రాతి కట్టడాలే
- దశాబ్దాలుగా ఈ కట్టడాలకు తగ్గని ఆదరణ
- నేటికీ పల్లెల్లో నాపరాయితోనే ఇళ్లు, ఇతర నిర్మాణాలు
- తాండూరులో ఏళ్లు గడిచినా చెక్కుచెదరని కట్టడాలెన్నో..


నాపరాళ్ల ఘనుల్లో తవ్వకాలు

బషీరాబాద్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాతి కట్టడాలకు గుర్తుకొచ్చేది తెలంగాణ-కర్ణాటక సరిహద్దుల్లోని తాండూరు ప్రాంతం. ఇక్కడి నాపరాతి గనులు, రాతి కట్టడాలు దేశవిదేశాల్లో ప్రసిద్ధిగాంచాయి. దశాబ్దాల నుంచీ నాపరాయితో ఇళ్లు కట్టుకుంటున్నారు. వేలాది ఎకరాల్లో ఉన్న రాళ్ల నిక్షేపాలను వేలాది మందికి ఉపాధి చూపుతున్నాయి. ఇళ్ల పునాదులకు నాపరాయే వేస్తారు. చరిత్రను చూసినా ఇళ్లు, గుళ్లు, కోటలు, బురుజులు, గ్రామాల స్వాగత తోరణాలు, మసీదులు, సమాధులు వంటివన్నీ నాపరాళ్లతోనే కట్టారు. ఏళ్లపాటు అవి చెక్కుచెదరలేదు. నిజాం పాలనకు ముందు నుంచే ఇక్కడి ప్రజలకు నాపరాయితో పెనవేసుకున్న బంధంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.


బషీరాబాద్, తాండూరు మండలాల్లో వేల ఎకరాల్లో నాపరాయి గనులున్నాయి. ఈ గనుల్లో నాపరాయి తవ్వి దేశ విదేశాలకు ఎగుమతి చేస్తుంటారు. మార్కెట్లో నాపరాయికి డిమాండ్ ఉండడంతో తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. వ్యాపారులు, గని కార్మికులు, కూలీలు వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. నాపరాయి పాలిషింగ్ యూనిట్లు(పరిశ్రమలు)తో దేశంలోని వివిధ ప్రాంతాల వారికి ఉద్యోగ, ఉపాధి దొరుకుతోంది. ఈ ప్రాంతంలో నాపరాయి ఇళ్ల నిర్మాణాలు, చారిత్రక కట్టడాలు విరివిగా కనిపిస్తుంటాయి. ప్రస్తుతం సీసీ భవనాలు కడుతున్నా పునాదికి మాత్రం నాపరాయినే వాడుతున్నారు. నాపరాళ్లు చవకగా, స్థానికంగా లభిస్తుండడంతో పునాదికి, గోడలకు, ఇళ్లకు వాడుతున్నారు. నాపరాయి నిర్మాణాలు దశాబ్దాల పాటు మన్నికగా, చెక్కు చెదకుండా ఉంటాయి. నేటికీ ఇక్కడి గ్రామాల్లో 90శాతం ఇళ్లను నాపరాళ్లతో కట్టి, పైకప్పును సైతం పల్చటి బండలతో వేస్తారు.

బషీరాబాద్‌లో చారిత్రక కట్టడాలెన్నో

బషీరాబాద్ ఒకనాటి జిల్లా కేంద్రం. నిజాం పాలనలో గుల్బర్గా రాష్ట్రంలో అంతర్భాగం. ఇక్కడి బ్రిటిష్, నిజాం కాలంలో కార్యాలయాలుగా వినియోగించిన భవనాలు అనేకం ఉన్నాయి. అప్పట్లో వినియోగించిన కలెక్టర్, కోర్టు భవనం, జైలు, పోలీస్ సూపరింటెండెంట్, డీఎస్పీ కార్యాలయాలు, పోలీసు క్వార్టర్లు, తహసీల్దార్, పోలీస్ స్టేషన్ వంటి భవనాలు, పలు కార్యాలయాలు నాపరాళ్లతో కట్టినవే. వందల ఏళ్లు దాటినా.. శిథిలావస్థకు చేరినా ఉనికి చాటుకుంటున్న రాతి కట్టడ భవనాలు ఎన్నో ఈ ప్రాంతాల్లో ఉన్నాయి.

దొంగల నుంచి రక్షణ కోసం నాపరాతి బురుజుల నిర్మాణం

పూర్వికులు దివిటీ దొంగల నుంచి సంపదనను కాపాడుకునేందుకు గ్రామాల్లో ఎత్తైన ప్రదేశంలో నాపరాళ్లలతో పెద్ద, బురుజులను నిర్మించగా నేటికీ అవి చెక్కుచెదరలేదు. ప్రజలు తమ సంపదను బురుజుల్లో భద్రపర్చుకునే వారు. బురుజులకు ఒకే ద్వారం పెడతారు. అవసరమైతే కొందరు గ్రామస్తులు కలిసి బురుజుల్లో రాత్రిళ్లు కాపలా ఉండేవారు. దీంతో దొంగలు వాటిల్లోకి దూరే వీలుండేది కాదు. దొంగలు వచ్చినా బురుజుపై ఉండి రాళ్లతో కొట్టేవారు. వేడినీళ్లను చల్లి దొంగలను తరిమికొట్టేవారని పెద్దలు చెబుతారు. దశాబ్ధాలు గడిచినా కొన్నిచోట్ల బురుజులు నేటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి.


నాపరాయితో నిర్మించిన రైల్వే బ్రిడ్జి


ఇళ్ల పైకప్పులకు వేసిన నాపరాయి

అన్ని పరిస్థితులనూ తట్టుకునే ఇళ్లు

వేసవి, వర్షా కాలం, చలికాలం ఏ సీజన్ వచ్చినా నాపరాయి ఇళ్లకు ఢోకా ఉండదు. ఇళ్ల పైకప్పులను కర్రలపై పేర్చిన పల్చని బండరాళ్లతో తీర్చి దిద్దుతారు. దీంతో వేడి కూడా అంతగా ఉండదు. పైకప్పునకు ఎక్కువగా కర్రలు వాడతారు కాబట్టి వేడి కిందికి రాదు. రాళ్లపైకప్పుల ఇళ్లు చల్లాగానే ఉంటాయి. వర్షాకాలంలోనూ ఈ పైకప్పులు అస్సలే ఉరవవు. బంగళాలు, మిద్దెలపై వర్షపు నీరు నిలిచి ఉరవడం, గోడల్లో పగుళ్ల ఏర్పడడం వంటివి సంభవిస్తాయి. కానీ బండరాళ్ల ఇళ్లపై చుక్కనీరు నిలువదు. చలికాలంలోనూ ఈ ఇళ్లలో వెచ్చగా ఉంటుంది. ఈ దృష్ట్యా రాతి కట్టడాల ఇళ్లు అన్నివాతావరణ పరిస్థితులను అనుకూలం అనడంలో సందేహం లేదు.

కావాల్సిన ఆకారంలో ఇళ్ల నిర్మాణం

ప్రజలు తమకు కావాల్సిన ఆకారాల్లో నాపరాళ్ల ఇళ్లను నిర్మించుకుంటారు. పైకప్పులను పల్చని బండరాళ్లతో వేసుకుంటున్నారు. కొత్త వారు నాపరాళ్ల ఇళ్లు, పైకప్పులను చూసి ఆశ్చర్యపోతుంటారు. పైకప్పు బండలు పడిపోవా అని గ్రామస్తులను అడుగుతుంటారు. అలాగే నాపరాయి కట్టడాల చరిత్రను తెలుసుకుంటారు.

అంగన్‌వాడీల్లో సరైన వసతులు కల్పించాలి


సీసీ రోడ్డు పనులపై ఆరా తీస్తున్న అడిషనల్ కలెక్టర్ సుధీర్

బషీరాబాద్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్వత్‌పల్లి, దామర్‌చెడ్, కొత్లాపూర్, ఎక్మాయి గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ సుధీర్ మంగళవారం పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతి, సౌకర్యాలు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అవసరమైన వసతులు కల్పించాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. పర్వత్‌పల్లిలో వేసిన సీసీ రోడ్డును పరిశీలించి అక్కడున్న పీఆర్ ఏఈతో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్ర పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని కార్యదర్శి మౌనిక, టీచర్ బాలమణిలతో అని పారిశుధ్య నిర్వహణ సరిగ్గా ఉండేలా చూసుకోవాలన్నారు. పనిచేయని బోరుమోటార్లకు మరమ్మతులు చేయించాలని పంచాయతీ కార్యదర్శి అంజుమ్‌కు చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ వై.వెంకటేష్, ఎంపీడీవో విజయ్‌కుమార్, మిషన్ భగీరథ డీఈఈ తేజబాబు, తాండూరు సీడీపీవో శ్రీలక్ష్మి, సూపర్‌వైజర్ జ్యోతి, సీనియర్ అసిస్టెంట్ షేర్ఖాన్ తదితరులు ఉన్నారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యతుంటేనే బిల్లులు

తాండూరు రూరల్: సీసీ రోడ్డు నాణ్యతగా ఉంటేనే బిల్లులు చెల్లిస్తామని అడిషనల్ కలెక్టర్ సుధీర్ అన్నారు. తాండూరు మండలం చింతామణిపట్నంలో ఎస్‌డీఎఫ్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను పరిశీలించారు. రూ.3లక్షలతో మాధవరెడ్డి ఇంటి నుంచి కుర్వ నర్సప్ప ఇంటి వరకు, రూ.2లక్షలతో రామప్ప ఇంటి నుంచి ఊరడమ్మ ఆలయం వరకు నిర్మించిన సీసీ రోడ్లను పరిశీలించారు. ఆయనవెంట పంచాయతీరాజ్ డీఈ నాగభూషణం, ఎంపీడీవో విశ్వప్రసాద్, ఎంపీవో ఆనంద్‌రావు, పంచాయతీ కార్యదర్శి కరుణాకర్‌రెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ-ఆర్జీకేకాలనీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.30లక్షలు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ప్రశాంత్, వినోద్ రెడ్డి, అక్షయ్, సుబాష్ పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం


రేవంత్‌రెడ్డి,మనోహర్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

తాండూరు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరన్‌కోట్ గ్రామంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్ ఆధ్వర్యంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనిల్ మాట్లాడుతూ కరన్‌కోట్ గ్రామం నుంచి బషీరాబాద్ మండల కేంద్రానికి రూ.30కోట్లతో 12కిలో మీటర్ల రోడ్డు మంజూరు చేయడం హర్షణీయమన్నారు.

మార్కెట్ అభివృద్ధికి కృషి చేయాలి

మర్పల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ అభివృద్ధికి కృషి చేయాలని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. ఆయనతో పాటు వైస్‌చైర్మన్‌గా మల్లేశ్‌యాదవ్‌తో పాటు డైరెక్టర్లు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు, మార్కెటింగ్ అధికారులు పాల్గొన్నారు.

అప్‌గ్రేడ్ సరే.. వసతులేవి?

(5వ పేజీ తరువాయి)

ఉండటం లేదు. దీంతో చాలా చోట్ల కోట్ల రూపాయలు చేసే విలువైన యంత్రాలు నిరుపయోగంగా మారాయి.

చేవెళ్ల ఆస్పత్రిలో వేధిస్తున్న వైద్యుల కొరత

రంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో జిల్లా ఆసుపత్రితోపాటు వనస్థలిపురంలో ఏరియా ఆసుపత్రి ఉంది. చేవెళ్ల, షాద్‌నగర్, హయత్‌నగర్, మహేశ్వరం, రాజేంద్రనగర్, ఆమనగల్లు, ఇబ్రహీంపట్నం, శంషాబాద్, యాచారంలో కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లు కొనసాగుతున్నాయి. ఈ సెంటర్లన్నీ అప్‌గ్రేడ్ చేశారు అయినా అదే దుస్థితి. చేవెళ్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 100 పడకల ఆసుపత్రిగా 2022లో అప్‌గ్రేడ్ చేశారు. ఆసుపత్రి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 17.50 కోట్లు మంజూరు చేసింది. అయినా ఏడాదిన్నర కాలంగా నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. ఇంత జరుగుతున్నా రాష్ట్ర వైద్య విధాన పరిషత్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం కొనసాగుతున్న కమ్యూనిటీ హెల్త్ హెల్త్ సెంటర్ స్థాయిలోనే 59 మంది వైద్య సిబ్బందికి 31 మంది ఉన్నారు. 20 మంది డాక్టర్లు ఉండాలి కానీ.. 11 మంది మాత్రమే ఉన్నారు. ప్రస్తుతం ఉన్న 11 మంది డాక్టర్లు కూడా స్థానికంగా అందుబాటులో ఉండటం లేదు. ఓపీ భారీగా పెరిగింది. ఆసుపత్రిలో బ్లెడ్ బ్యాంకు లేకపోవడంతో ఆపరేషన్ సమయంలో రక్తం కోసం నగరానికి పరుగులు తీస్తున్నారు.


చుట్టపు చూపులా డాక్టర్ల రాక

స్థానికంగా స్కానింగ్ మెషిన్లు లేక కడుపులో బిడ్డతో 42 కిలో మీటర్ల మేర ప్రయాణం చేసి నగరానికి వెళ్లి స్కానింగ్ చేయిస్తున్నారు. పేరుకే పెద్దాసుపత్రి అయినా ఇక్కడ గర్భిణులకు అవసమయ్యే అల్ట్రాసౌండ్ మిషన్ సైతం అందుబాటులో లేదు. గత 20 ఏళ్ల క్రితం ప్రభుత్వం సరఫరా చేసిన యంత్రం పనిచేయడం లేదు. అల్ట్రాసౌండ్‌తో పాటు రేడియాలజిస్టు లేరు. ముగ్గురు గైనకాలజిస్టులు ఉన్నప్పటికీ.. ఒక్కరు కూడా అందుబాటులో ఉండటం లేరు. వారానికి రెండు సార్లు చుట్టపు చూపులా ఇలా వచ్చి అలా వెళుతున్నారు. ఓ ప్రైవేట్ మెడికల్ కాలేజీ, ఆసుపత్రి దగ్గరలో ఉంటంతో అక్కడికి రెఫర్ చేస్తున్నారు. ల్యాబ్ టెక్నీషియన్ ఒక్కరే ఉండటంతో ఇబ్బందులు నెలకొంటున్నాయి.

రూ. 80 లక్షల ఆక్సిజన్ ప్లాంట్ నిరుపయోగం

కరోనా సమయంలో ఆక్సిజన్ కోసం అల్లాడుతున్న సమయంలో భారత్ డైనమిక్ లిమిటెడ్(బీడీఎల్) ప్రతినిధులు రూ.80లక్షలు ఖర్చు పెట్టి ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. దీనికి అవసరమైన రూ.10లక్షలకు పైగా విలువైన జనరేట్‌ను స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఇచ్చారు. ఏ ఒక్క రోజు కూడ ఈ ప్లాంట్‌ను వినియోగించిన దాఖలాలు లేవు. దీంతో జనరేటర్ కూడా ఎండకు ఎండుతూ.. వానకు నానుతూ దర్శనమిస్తుంది. ప్రత్యేకంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లేకపోవడంతో ఓల్టేజీలో హెచ్చుతగ్గులతో డయాలసిస్ కేంద్రం లో ఇటీవల షార్ట్ సర్క్యూట్ సంభవించి ఎల క్ట్రిక్ వైరింగ్ మొత్తం కాలిపోయింది.

పేరుకే పెద్ద ఆస్పత్రి



చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రి పేరుకే ఏరియా ఆసుపత్రి. ఇక్కడ రోగులకు అవసరమైనా ఎలాంటి సౌకర్యాలు లేవు. దీంతో వైద్యులు చిట్టీ రాసి ఇతర ఆసుపత్రులకు పంపిస్తున్నారు. ఇంత మంది వైద్యులు ఉండి కూడా ఏమీ లాభం లేదు. నిత్యం ఓపీ చూసి పంపిస్తున్నారే తప్ప ఆపరేషన్లు చేసిన దాఖలాలు లేవు. ఉన్నతాధికారులు స్పందించాలి. అవసరమైన సౌకర్యాలను వెంటనే ఏర్పాటు చేయాలి. అలాగే వైద్యులు నిత్యం అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి.

- పి.మల్లారెడ్డి, చేవెళ్ల పట్టణం

షాద్‌నగర్‌లో ల్యాబ్ పరికరాలు కరువు

షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ 2023లో ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే భవన నిర్మాణం కోసం రూ. 5 కోట్లు మంజూరు చేయడంతో షాద్‌నగర్ పట్టణ శివారులోని లింగారెడ్డిగూడ ఆస్పత్రి నిర్మాణ పనులు చేపట్టారు. పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేయకపోవడం, చేసిన పనులకు కాంట్రాక్టర్‌కు డబ్బులు చెల్లించకపోవడం వల్ల పనులు నిలిచిపోయాయి. ప్రస్తుత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవ తీసుకుని సదరు కాంట్రాక్టర్‌కు పాత బకాయిలు చెల్లించడంతో పాటు, నిర్మాణానికి అవసరమైన నిధులు కూడా చెల్లిస్తానని హామీ ఇవ్వడంతో పనులు నడుస్తున్నాయి. ప్రస్తుతం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రిలో 80 మంది సిబ్బంది అవసరం ఉండగా కేవలం 40 మంది మాత్రమే అందుబాటులో ఉన్నారు. వైద్య సిబ్బందితో కలిపి 40 ఖాళీలు ఉన్నాయి. ప్రస్తుతం 22 మంది వైద్యులు ఉన్నారు. వైద్య సిబ్బందికి అనుగుణంగా నర్సులు అందుబాటులో లేరు. ప్రస్తుతం 18 మంది మాత్రమే ఉన్నారు. అలాగే ఫార్మసీలో నలుగురు సిబ్బంది అవసరం ఉంది. అయినా ఒక్కరు మాత్రమే ఉన్నారు. ఆస్పత్రిలో సీటీ స్కాన్, ఎంఆర్‌ఐ, ల్యాబ్ పరికరాలు అందుబాటులో లేవు.

ఆమనగల్లులో ఓపీ మాత్రమే

ఆమనగల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 2021 డిసెంబర్‌ల 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేశారు. కానీ.. నేటికి పూర్తి స్థాయిలో వైద్య సిబ్బంది, బెడ్స్ లేవు. 32 మంది వైద్య సిబ్బందికి గాను 24 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఆస్పత్రి భవనం కోసం రూ.17.50 కోట్లు మంజూరు కావడంతో పాత భవాన్ని తొలగించి అదేస్థానంలో కొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు. దీంతో తాత్కాలికంగా ఆసుపత్రి డాక్టర్ క్వార్టర్‌లో కొనసాగిస్తున్నారు. భవనం లేని కారణంగా ఆసుపత్రి ఓపి సేవలకే పరిమితమైంది. ఆసుపత్రిని సీహెచ్‌సిగా అప్‌గ్రేడ్ చేసినా వైద్య సేవలు మెరుగుపడలేదు.

వేధిస్తున్న డ్రగ్స్ కొరత

30 పడకలుగా ఉన్న మహేశ్వరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ 50 పడకల కోసం అప్‌గ్రేడ్ చేసినప్పటికీ.. 16 మంది డాక్టర్లకు 12 మంది డాక్టర్లు మాత్రమే ఉన్నారు. ఇబ్రహీంపట్నంలోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ 30 పడకల నుంచి 50 పడకలకు అప్‌గ్రేడ్ చేసిన తర్వాత పది మంది డాక్టర్లు ఉండాల్సి ఉండగా ఐదుగురు మాత్రమే ఉన్నారు. గైనకాలజిస్టు, అనస్థీషియా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ హైపర్ టెన్షన్(ఎన్సీపీ) డ్రగ్స్ కొరత ఉంది.


చేవెళ్ల ఆస్పత్రిలో నిరుపయోగంగా దర్శనమిస్తున్న ఆక్సిజన్ ప్లాంట్

సర్జన్లు లేక నిలిచిన ఆపరేషన్లు

వికారాబాద్ జిల్లా పరిగిలోని కమ్యూనిటి హెల్త్ సెంటర్ అప్‌గ్రేడ్ అయినప్పటికీ.. ఇక్కడ యంత్రాల కొరత వేధిస్తోంది. డాక్టర్లు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నప్పటికీ.. ఎక్స్‌రే, డెంటల్ చైర్ అందుబాటులో లేదు. ఆస్పత్రిలో నిత్యం 400 నుంచి 500 వరకు ఓపీ రోగులు వస్తున్నారు. 15 నుంచి 25కు ఇన్‌పేషెంట్లు ఉంటున్నారు. కొన్ని రకాల మందులు ఆసుపత్రిలో లేకపోవడంతో బయటకు రాస్తున్నారు. కొడంగల్‌లోని 30 పడకల ఆసుపత్రిని 50 పడకలగా అప్‌గ్రేడ్ చేశారు. అయినా 11 మంది వైద్య సిబ్బందికి పది మంది ఉన్నారు. ఆపరేషన్ థియేటర్ ఉన్నప్పటికీ.. సర్జన్ లేకపోవడంతో ఆపరేషన్లు జరగడం లేదు. కొడంకగల్‌కు మంజూరైన మెడికల్ కాలేజీకి అసుపత్రిని అనుసంధానించారు. మేడ్చల్ జిల్లా శామిర్‌పేట లోని పీహెచ్‌సీని 2021లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేశారు. 30 మంది వైద్య సిబ్బందికి గాను 27 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఇక్కడ కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడం లేదు.

ఆస్పత్రుల్లో వైద్య సిబ్బంది వివరాలు

రంగారెడ్డి జిల్లా	ఉండాల్సిన సిబ్బంది	ప్రస్తుతం	ఖాళీలు
చేవెళ్ల	59	31	28
షాద్‌నగర్	80	40	40
కల్వకుర్తి(ఆమనగల్లు)	32	24	08
మహేశ్వరం	16	12	04
రాజేంద్రనగర్	38	30	08
ఇబ్రహీంపట్నం	10	05	05
మొత్తం	235	142	93
వికారాబాద్-మేడ్చల్ జిల్లా: పరిగి	57	57	0
కొడంగల్	11	10	01
శామీర్‌పేట	30	27	03
మొత్తం	98	94	04

ముస్సిపాలిటీలపై ఆర్థిక భారం

- గుదిబండలా మారిన పంచాయతీల విలీనం
- ఇళ్ల అనుమతులు నిలిపివేత
- నిలిచిపోయిన ఆదాయం
- కుదేలవుతున్న మున్సిపల్ ఖజానా

కీసర రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విలీన గ్రామ పంచాయతీలతో మున్సిపాలిటీల పాలన అస్తవ్యస్తంగా మారింది. నిధుల లేమి, సిబ్బంది కొరతతో కొట్టుమిట్టాడుతున్న మున్సిపాలిటీలకు విలీన ప్రక్రియ గుదిబండగా మారింది. మేడ్చల్ జిల్లాలో నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో కీసర మండలంలోని పలు గ్రామాలను విలీనం చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో సెప్టెంబరు 10వ తేదీన కరీంగూడ, గోదుమకుంట, రాంపల్లిదాయర, బోగారం గ్రామాలు నాగారం మున్సిపాలిటీలో, చీర్యాల, కీసర, నర్సంపల్లి, తిమ్మాయిపల్లి, యాద్గార్‌పల్లి, అంకిరెడ్డిపల్లి గ్రామాలు దమ్మాయిగూడ మున్సిపాలిటీలో విలీనమయ్యాయి. పంచాయతీ పాలనకు స్వస్తి పలికి పురపాలనకు శ్రీకారం చుట్టారు. ఆయా గ్రామాల నాయకులు, ప్రజలు నిరసన తెలిపినప్పటికీ అవేమీ పట్టించుకోకుండా పంచాయతీలను మున్సిపాలిటీల్లో విలీనం చేశారు. నాటి నుంచి కార్యకలాపాలన్ని మున్సిపల్ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. రికార్డులన్నీ మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కాగా మున్సిపాలిటీల్లో విలీనమైన పంచాయతీల్లో ఇళ్ల అనుమతుల మంజూరు, పన్నుల విధింపు తదితర పనులను నిర్వహించే ఆన్‌లైన్ సైట్లను ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో పంచాయతీల పరిధిలో రాబడి నిలిచిపోయింది. ఆయా పంచాయతీల్లో చేపట్టే పనులన్నింటికీ మున్సిపాలిటీల నుంచే చెల్లింపులు జరపాల్సి వస్తుంది. దీంతో మున్సిపాలిటీలపై పెను ఆర్థిక భారం పడింది.



నాగారం మున్సిపల్ కార్యాలయం

మున్సిపాలిటీలు ఉనికిని కోల్పోయే ప్రమాదం

నాగారం, దమ్మాయిగూడ పంచాయతీలు మున్సిపాలిటీలుగా ఎదిగి నిలదొక్కుకుంటున్న సమయంలో విలీన చర్యతో మూలిగే నక్కపై తాటి పండు పడిన చందంగా పరిస్థితి మారిందని మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యులు కొంతమంది వాపోతున్నారు. విలీనమైన పంచాయతీల సిబ్బంది వేతనాలు, ఇతర ఖర్చులకూ మున్సిపాలిటీలపైనే ఆధారపడాల్సిన దుస్థితి నెలకొందని నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అత్యుత్సాహంతో చేపట్టిన పంచాయతీల విలీనంతో అటు గ్రామాలు, ఇటు మున్సిపాలిటీలు ఉనికిని కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏమాత్రం ఆదాయం లేని పల్లెలను, వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న గ్రామాలను మున్సిపాలిటీలుగా మార్చటమేంటని ఆవేదన చెందుతున్నారు. విలీన చర్యపై పునరాలోచించాలని కోరుతున్నారు. గ్రామ పంచాయతీలను విలీనం చేసిన మున్సిపాలిటీలకు అదనంగా నిధులను కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.

మున్సిపాలిటీలపై ఆర్థిక భారం తగ్గించాలి



పంచాయతీల విలీనంతో మున్సిపాలిటీలపై పడిన ఆర్థిక భారాన్ని తగ్గించాలి. పంచాయతీల నిధులను మున్సిపాలిటీలకు మళ్లించాలి. పంచాయతీల పరిధిలో విధుల నిర్వహణతో పాటు బాధ్యతలను మున్సిపాలిటీలకు అప్పగించాలి. ఇళ్ల నిర్మాణ అనుమతులు, పన్నుల వసూలు బాధ్యతలు మున్సిపాలిటీల ఆధ్వర్యంలోనే జరిగేలా చర్యలు తీసుకోవాలి. లేదంటే మున్సిపాలిటీల్లోనూ అభివృద్ధి కుంటుపడే ప్రమాదముంది.

\- కౌకుంట్ల చంద్రారెడ్డి, మున్సిపల్ చైర్మన్, నాగారం

న్యూస్ బాక్స్

నస్కల్‌ను మునిసిపాలిటీలో కలపొద్దు


నస్కల్ గ్రామ పంచాయతీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

పరిగి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నస్కల్ గ్రామ పంచాయితీని పరిగి మునిసిపాలిటీలో కలపొద్దని మంగళవారం నస్కల్ గ్రామ పంచాయితీ వద్ద గ్రామస్తులు నిరసన వ్యక్తంచేశారు. నస్కల్ పంచాయితీని పరిగి మునిసిపాలిటీలో కలిపేందుకు మునిసిపల్ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ విషయం తెలుసుకున్న నస్కల్ గ్రామస్తులు మంగళవారం గ్రామంలో సమావేశమయ్యారు. మునిసిపాలిటీలో కలిపితే ఉపాధి హామి పథకం వర్తించదని, ఇతర పథకాల లబ్ధి చేకూరదని తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని కలిసి తమ గ్రామాన్ని మున్సిపాలిటీలో కలపొద్దని కోరారు.

తిరుపతిరెడ్డికి సన్మానం


తిరుపతిరెడ్డిని సన్మానిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్

కొడంగల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డిని మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్య గౌడ్, డైరెక్టర్ ఆసిఫ్‌ఖాన్, శ్రీనివాస్‌రెడ్డి సన్మానించారు. కొడంగల్‌లో మంగళవారం తిరుపతిరెడ్డిని కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎన్.ప్రశాంత్ పాల్గొన్నారు.

ఉత్తమ రికార్డులను నెలకొల్పాలి

శామీర్‌పేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని విజ్ఞాన భారతి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్, జిల్లా ట్రస్మా ఉపాధ్యక్షుడు గోనె హనుమంతరెడ్డి క్రీడాకారులకు సూచించారు. మహబూబ్‌నగర్‌లో రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి 30 వరకు రాష్ట్ర స్థాయిలో ఖోఖో క్రీడా పోటీలకు శ్రీవిజ్ఞాన భారతి ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు క్రీడాకారులు సాయికుమార్, బన్నీ ఎంపిక కాగా కరస్పాండెంట్, ప్రిన్సిపాల్‌తో పాటు పీఈటీ ప్రశాంత్‌రెడ్డిలు అభినందిస్తూ సన్మానించారు.

లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు ప్రారంభం


స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

పరిగి,అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పరిగి పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం తృతీయ వార్షికోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉదయం యాగశాల ప్రవేశం, విశ్వేశ్వనఅనాధాన, వాసుదేవ పుణ్యావచనం,దీక్షాదారణ, రుత్వికర్మగణం, మృత్యంగ్రహణం, అంకురార్పణ, అఖండదీపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, ధ్వజారోహణం పూజ, హోమం, భేరిపూజ, దేవతాహ్వానం,నివేదన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని ఆలయ ధర్మకర్తలు ఎదిరె పద్మ,కృష్ణ, జయశ్రీ,నరేందర్‌లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, మాజీ జడ్పీటీసీ ఎస్‌పి బాబయ్య, డీసీసీ కార్యదర్శి కె.హన్మంత్‌ముదిరాజ్,పరుశరాంరెడ్డి,కృష్ణ, నిర్వహకులు, కౌన్సిలర్ ఎదిరె కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఉచిత వైద్య సేవలు అందిస్తాం: ఎమ్మెల్యే

పరిగి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ వర్తించని వారందరికీ సీఎంఆర్ఎఫ్ ద్వారా ఉచిత వైద్య సేవలు అందిస్తామని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పరిగిలోని తన నివాసంలో మంగళవారం వివిధ మండలాలకు చెందిన వారి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ఏ వ్యక్తి కూడా ఆరోగ్యం పట్ల ఇబ్బందులు పడకూడదన్నారు. అందరికీ ఉచిత వైద్యం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బి.పరశురాంరెడ్డి, తావుర్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలకు ఆకర్షితులై బీజేపీలో చేరిక


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శిరీష

మర్పల్లి, అక్టోబరు 22: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మహిళలు బీజేపీలో చేరుతున్నారని పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శిరీష అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం పార్టీ మండల అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన మహిళలు పెద్ద ఎత్తున బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్వరి, నాయకులు మోహన్‌రెడ్డి, రాంచందర్, రాఘవేందర్, మల్లికార్జున్, నాగయ్య, జంగం సుభాష్, యాదవరెడ్డి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

ధారూరు: మండలంలోని నాగారంలో బీజేపీ ఆన్‌లైన్ సభ్యత్వా నమోదు కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, నియోజకవర్గ కో ఆర్డినేటర్ వడ్ల నందు నాగసమందర్, అల్లాపూర్ గ్రామాల్లో పర్యటించారు. వారు మాట్లాడుతూ.. దేశ ప్రజలకు సమర్థ పాలన అందిస్తున్న బీజేపీలో చేరాలని పిలుపునిచ్చారు. ఆయా గ్రామాల్లో వారు బీజేపీ ఆన్‌లైన్ సభ్యత్వాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు రమేశ్, నాయకులు పాండుగౌడ్, శివమణి, వివేకానంద రెడ్డి, రాజునాయక్, అంజయ్య, రాజేందర్ గౌడ్, మణికంఠ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

భూ వివాదంలో ఇరువర్గాల ఘర్షణ

- ఇద్దరికి తీవ్రగాయాలు

కులకచర్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భూ వివాదంలో రెండు కుటుంబాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పరస్పర దాడులకు పాల్పడటంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని అంతారం గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. అంతారం గ్రామానికి చెందిన కావలి రాములు, వేపూరి రామయ్య కుటుంబాల మధ్య భూమి విషయంలో 15 సంవత్సరాలుగా గొడవలు ఉన్నాయి. రెండు కుటుంబాలను గ్రామపెద్దలు రాజీ చేసినా గొడవపడుతూనే ఉన్నారు. సోమవారం భూమి విషయంలో మరో మారు రెండు కుటుంబాల మధ్య గొడవ జరిగింది. రాత్రి సమయంలో కావలి రాములతో పాటు బసప్ప (ప్రభుత్వ ఉపాధ్యాయుడు), చెన్నయ్య తదితరులు వేపూరి రామయ్య ఇంటిపై దాడిచేశారు. ఇంట్లో ఉన్న వేపూరి చంద్రమౌళి, నారాయణమ్మ, వెంకటయ్య, లావణ్య, శ్రీకాంత్, శరత్‌పై కర్రలతో దాడిచేశారు. ఈ ఘటనలో వేపూరి చంద్రమౌళి, నారాయణమ్మలకు తీవ్రగాయాలు కాగా హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. నారాయణమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అన్వేష్‌రెడ్డి తెలిపారు.

కొర్విచెడ్‌లో గొడవ.. ఇరువర్గాలపై కేసు

బషీరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గొడవపడి దాడికి దిగిన కేసులో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు బషీరాబాద్ ఎస్ఐ గఫార్ మంగళవారం తెలిపారు. కొర్విచెడ్ గ్రామానికి చెందిన మాలశేఖర్, మాల శ్రీనివాస్, మాల వెంకటప్పలు, మరో వర్గం మాల శ్రీనివాస్, మాల నర్సింహులు సోమవారం రాత్రి అకారణంగా ఘర్షణకు దిగారు. ఒకరిపై ఒకరు దూషణలు చేసుకుంటూ దాడికి పాల్పడ్డారు. ఇరు వర్గాల పరస్పర ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

తాండూరు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రేమ జంట కరన్‌కోట్ పోలీసులను ఆశ్రయించింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఓ మేజర్ గ్రామానికి చెందిన యువకుడు, పరిగి ప్రాంతానికి చెందిన ఓ అమ్మాయి ఇద్దరూ మేజర్లు. గత రెండేళ్ల కిందట హైదరాబాద్‌లో ఏర్పడిన వీరి పరిచయం ప్రేమగా మారింది. పెళ్లి చేసుకునేందుకు సిద్ధమై విషయాన్ని పెద్దలకు చెప్పగా వారు అంగీకరించలేదు. దీంతో ఇంటి నుంచి పారిపోయి గుడిలో పెళ్లి చేసుకున్నారు. అనంతరం అమ్మాయి కుటుంబ సభ్యుల నుంచి రక్షణ కల్పించాలని మంగళవారం కరన్‌కోట్ పోలీసు స్టేషన్‌కు వచ్చారు. ఇరువర్గాల కుటుంబ సభ్యులను ఎస్ఐ విఠల్‌రెడ్డి మాట్లాడి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇద్దరూ మేజర్లు కావడంతో చట్టప్రకారం వారి వివాహం చెల్లుతుందని అన్నారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న జంటకు ఏమైనా జరిగితే ఇరు కుటుంబ సభ్యులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కాళ్లమీద పడ్డా కనికరించలేదు

కరన్‌కోట్ పోలీసుస్టేషన్‌కు ప్రేమపెళ్లి చేసుకుని వచ్చిన అమ్మాయిని చూసి కుటుంబసభ్యులు, బంధువులు విలపించారు. ప్రేమ పెళ్లిళ్లు ఎక్కువకాలం నిలవవని, మన ఇంటికి వెళ్లిపోదామంటూ కుటుంబసభ్యులు అమ్మాయి కాళ్లమీద పడ్డారు. అయినా ఆ అమ్మాయి కనికరించలేదు. 20ఏళ్లు పెంచిన తమను వదిలి రెండేళ్లు ప్రేమించిన వ్యక్తి కావాలనుకుంటుందంటూ బోరున విలపిస్తూ వెళ్లిపోయారు.

అనుమతి లేకుండా షూటింగ్ నిర్వహిస్తున్న ఇద్దరిపై కేసు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా ఓ వెబ్‌సిరీస్ షూటింగ్ నిర్వహిస్తున్న ఇద్దరు యూనిట్ నిర్వాహకులపై పోచారం ఐటీసీ పోలీసులు మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం మున్సిపాలిటీ, చౌదరిగూడ, విజయపురి కాలనీ సూర్య ఆస్పత్రి ఆవరణలో చిరంజీవి వెబ్ సిరీస్ నిర్వహిస్తున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా వెబ్‌సిరీస్ చిత్రీకరిస్తూ, వరంగల్-హైదారాబాద్ జాతీయరహదారిపై ట్రాఫిక్ జామ్ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని చిత్ర యూనిట్ నిర్వాహకులైన నల్ల వెంకటేశ్వర్లు, జగదీష్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మతిస్థిమితం లేని వృద్ధురాలు అదృశ్యం


చంద్రమ్మ

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మతిస్థితిమతం లేని వృద్ధురాలు అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ పరశురాం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపల్, ఈడబ్ల్యుఎస్ కాలనీలో నివాసముంటున్న కడమంచి చంద్రమ్మ(65) గత ఆగస్టు 19న మహబూబ్‌నగర్‌లోని కూతురు ఇంటికి వెళ్లి తిరిగిరాలేదు. ఆమె కుటుంబసభ్యులు మహబూబ్‌నగర్‌కు ఫోన్‌చేయగా ఘట్‌కేసర్‌కు తిరిగి బయల్దేరిందని తెలిపారు. అప్పటి నుంచి చంద్రమ్మ కుటుంబసభ్యులు తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఫలితం లేకపోవడంతో మంగళవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. చంద్రమ్మకు మతిస్థితిమతం సరిగా లేదని తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్ట్

వికారాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పేకాడుతున్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ పట్టణ పరిధిలోని కొంపల్లి గ్రామంలో ఓ ఫాంహౌస్‌లో మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు చేయగా అక్కడ పేకాడుతున్న ఏడుగురిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.19,250ల నగదు, ఆరు మొబైల్ ఫోన్లు, ఒక కారు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకుని వారిని వికారాబాద్ పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

అప్పిచ్చి అవస్థలు

(5వ పేజీ తరువాయి)


వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

ప్రస్తుత ఏఎంసీ పాలకవర్గం తర్జనభర్జన పడుతోంది. శంకర్‌పల్లి ఏఎంసీకి 2016లో 1.1కోట్లు, గజ్వేల్ ఏఎంసీకి 2017లో రూ.50లక్షలు, 2018లో జగిత్యాల ఏఎంసీకి రూ.2.2కోట్లు, తూప్రాన్ ఏఎంసీకి 2018లో, మహేశ్వరం ఏఎంసీకి 2018లో కోటి చొప్పున అప్పిచ్చారు. ఈ అప్పుల వసూళ్లపై గత పాలకవర్గాలు పట్టించుకోకపోవడంతో రికవరీ కాలేదు. దీంతో నిధులు లేక మేడ్చల్ మార్కెట్ కమిటీ అభివృద్ధికి ఆటంకాలు కలుగుతున్నాయి.

మార్కెట్ కమిటీకి పలు మార్గాల్లో ఆదాయం

మేడ్చల్ మార్కెట్ కమిటీ పరిధి మేడ్చల్, శామీర్‌పేట, మూడుచింతలపల్లి, కీసర, కుత్బుల్లాపూర్, భౌరంపేట మండలాల్లో పెద్దఎత్తున ఉన్న విత్తనపరిశ్రమల నుంచి ఏటా కోట్లలో ఆదాయం వస్తోంది. శీతల గిడ్డంగులు, వ్యవసాయ రంగ వ్యాపారాలకు ట్రేడ్ లైసెన్స్‌ల జారీ ట్యాక్సుల రూపంలో ఆదా యం వస్తోంది. మార్కెట్ కమిటీ సొంతంగా నిర్మించిన భవనాలు, గోడౌన్ల నుంచి కూడా ఏటా 50లక్షల వరకు అద్దె వస్తుంది. రైస్‌మిల్లులు, కూరగాయల వ్యాపారుల నుంచి వసూలుచేసే పన్నుల ఆదాయం కూడా వస్తుంది. దీంతో ఏటా ఏఎంసీకి కోట్లలో ఆదాయం సమకూరుతోంది. ఈ ఆదాయాన్ని స్థానిక రైతుల కోసం ఖర్చు చేయకుండా అప్పులిచ్చారని విమర్శలొస్తున్నాయి.

సొంత భవనం లేని మార్కెట్ కమిటీ

కండ్లకోయ పరిధిలో గతంలో ఉన్న మార్కెట్ కమిటీ స్థలం మొత్తం 9 ఎకరాల వరకు తెలంగాణ ఐటీ హబ్‌కు ప్రభుత్వం కేటాయించింది. దీంతో ఏఎంసీకి కార్యాలయం లేకుండా పోయింది. మేడ్చల్ పట్టణ పరిధి 806 సర్వే నంబర్‌లోని 5 ఎకరాలను ఏఎంసీకి కేటాయించారు. రూ.2కోట్లు మం జూరు చేయగా పనులు కొనసాగుతున్నాయి. కోట్ల రూపాయల ఆదా యం ఉన్న మేడ్చల్ మార్కెట్ కమిటీకి సొంత భవనం లేక గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ వార్డు కార్యాలయంలో విధులు నిర్వహిస్తోం ది. వేరే మార్కెట్ కమిటీల అభివృద్ధికి నిధులిచ్చిన మేడ్చల్ ఏఎంసీకే సొం త భవనం లేకపోవడం గమనార్హం. అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్టు మేడ్చల్ మార్కెట్ కమిటీ ఆదాయాన్ని ఇతరులకు పంచి ఇక్కడి రైతులకు అన్యాయం చేశారని అన్నదాతలు,వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్థానిక రైతులకు తీరని అన్యాయం



వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదాయాన్ని ఇతరులకు అప్పులుగా ఇచ్చి స్థానిక రైతుల సంక్షేమాన్ని పాలకులు కాలరాస్తున్నారు. బడా నేతలు పలుకుబడిని ఉపయోగించుకుని మార్కెట్ కమిటీ ఖజానాను గండిపెడుతున్నారు. తమ ప్రాంతం మార్కెట్ కమిటీల అభివృద్ధి కోసం అప్పు రూపంలో తీసుకుంటున్నారు. **- వంశీ రెడ్డి, మేడ్చల్**

రెండో రోజూ ప్రశాంతం

(5వ పేజీ తరువాయి)

కేంద్రం వరకు నడుచుకుంటూవస్తున్న అభ్యర్థులకు సమయం మించిపోతుండటంతో పోచారం పోలీసులు బైక్‌పై ఎక్కించుకోని కేంద్రం వద్ద దింపారు.

పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన సీపీ సుధీర్‌బాబు

కీసర (ఆంధ్రజ్యోతి): గ్రూపు-1 పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని రాచకోండ సీపీ సుధీర్‌బాబు అన్నారు. చీర్యాల్ గీతాంజలి కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని మంగళవారం సీపీ సందర్శించారు. పరీక్ష సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు సంచరించకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కాగా ఈ సెంటర్‌లో 936 మంది అభ్యర్థులకు గానూ 488 మంది పరీక్షకు హాజరయ్యారని, 448 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


మేడ్చల్ టౌన్: నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

వికారాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్తగాడి అంజిరెడ్డి డిమాండ్ చేశారు. వికారాబాద్ జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో మంగళవారం టీపీయూఎస్ సంఘం ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి, టీపీయూఎస్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరా ఉపాధ్యాయ ధర్మగ్రహదీక్షకు సిద్ధం అవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి, రాష్ట్ర బాధ్యులు జాకా వెంకటేశం, మండల కార్యదర్శి సంతోష్ పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రాంతం ఉపాధ్యాయుల సంఘం(తపస్) కార్యదర్శి గడప నవీన్ డిమాండ్ చేశారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మంగళవారం మేడ్చల్ మండలంలోని ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమానికి హాజరైన గడప నవీన్ మాట్లాడుతూ.. డీఏ బిల్లులను, పీఆర్‌సీను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షుడు వెంకట రమణ, జిల్లా కార్యదర్శి గోపాల్, జిల్లా కోశాధికారి రమాదేవి పాల్గొన్నారు.

దోమ: మండలంలోని కిష్టాపూర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ధర్మసత్యగ్రహంలో భాగంగా ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి సామూహికంగా నిరసన తెలిపారు. వీరి నిరసనకు పాఠశాల హెచ్ఎం లాల్యానాయక్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రబహదూర్, ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కృష్ణమూర్తి, సూరి, అమృత, శ్రీశైలం, వెంకటాచారి, శ్రీనివాస్, ప్రవీణ్ పాల్గొన్నారు.

పెద్దేముల్: డీఏ, పీఆర్‌సీ పెండింగ్ బిల్లులు తక్షణ పరిష్కారం కోరుతూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేపట్టారు. రాష్ట్ర బాధ్యులు ఆనందం సమక్షంలో మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు.


బషీరాబాద్: నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వికారాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి యాదవ్, పీడీఎస్ జిల్లా నాయకులు వైనర్సింహ కోరారు. వారు బీసీ నాయకులు జనార్ధన్‌రెడ్డి, రవీందర్‌తో కలిసి మంగళవారం అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

మార్కెట్ అభివృద్ధికి కృషి చేయాలి

మర్పల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ అభివృద్ధికి కృషి చేయాలని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. ఆయనతో పాటు వైస్‌చైర్మన్‌గా మల్లేశ్‌యాదవ్‌తో పాటు డైరెక్టర్లు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు, మార్కెటింగ్ అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నేత కన్నుమూత

బొంరాస్‌పేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రేగడిమైలారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గుర్మిట్‌కాల్ నర్సిరెడ్డి(70) సోమవారం రాత్రి కన్నుమూశారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం రాత్రి మృతిచెందారు. మంగళవారం స్వగ్రామం రేగడిమైలారంలో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి పాల్గొని ఆయన మృతికి సంతాపం తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

సంక్షిప్తంగా..

లెక్కలు పక్కాగా ఉండాలి

బషీరాబాద్: గ్రామపంచాయతీలో నిధుల వ్యయంపై లెక్కలు పక్కాగా ఉండాలని గ్రామ ప్రత్యేకాధికారి వై.వెంకటేష్ సూచించారు. అల్లాపూర్ గ్రామాన్ని మంగళవారం సందర్శించిన ఆయన అక్కడి కార్యదర్శితో పలు అంశాలపై చర్చించారు. అనంతరం పంచాయతీ రికార్డులను పరిశీలిస్తూ పలు సూచనలు చేశారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా విషయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కార్యదర్శిని ఆదేశించారు.

సీఎం సహకారం హర్షణీయం

బొంరాస్‌పేట్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సీఎం సహకారం హర్షణీయమని టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ అన్నారు. ఆయన మంగళవారం బొంరాస్‌పేట్ జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు యూత్ ఫర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, అనిల్‌కుమార్, గోపాల్, రాములు, లక్ష్మి, ప్రశాంత్ పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ అర్ధశతాబ్ది ఉత్సవాలు

వికారాబాద్: పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఏర్పడి 50 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఈనెల 24న ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించే అర్ధ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలిన పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి వై.గీత కోరారు. వికారాబాద్‌లోని సరస్వతీ జూనియర్ కళాశాలలో మంగళవారం పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అర్ధ శతాబ్ది ఉత్సవ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. పీడీఎస్‌యూ నాయకులు బొజ్జి శ్రీకాంత్, బి.మహేందర్, నవీన్ పాల్గొన్నారు.

గర్భిణులకు సూచనలు

యాలాల: యాలాల పీహెచ్‌సీలో గర్భిణులకు డాక్టర్ స్రవంతి పలు సూచనలు చేశారు. ఆరోగ్య కేంద్రంలో మంగళవారం గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు సలహాలు చేశారు. అనంతరం సీహెచ్‌వో చంద్రప్రకాష్ ఏఎన్ఎంలకు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ విజయ, సుశీల, శోభారాణి, సూపర్‌వైజర్, బసయ్యగౌడ్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలకు స్పందన

తాండూరు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జినుగుర్తి ఏకలవ్యలో ఏర్పాటు చేసిన ధన్వంతరి ఆయుర్వేద చికిత్స శిబిరానికి భారీ స్పందన లభించింది. ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం తమిళనాట సంప్రదాయ కంటి నిపుణులు ముత్తుకృష్ణన్ వారసుల పర్యవేక్షణలో ఈ శిబిరం నిర్వహించారు. శిబిరంలో 400 మందికిపైగా చికిత్స శిబిరంలో పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: వెల్చాల్‌లో మంగళవారం ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ ట్రస్టు హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో స్థానికుడు విజయ్‌కుమార్ మంగళవారం మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

కొడంగల్: వికారాబాద్ శ్రీ సాయి దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం కొడంగల్ పోలీస్‌స్టేషన్‌లో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య సిబ్బంది ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించి దంతాల రక్షణ కోసం సలహాలు, సూచనలు చేశారు. నిర్వాహకులను సీఐ శ్రీధర్‌రెడ్డి, అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు అధ్వానం.. వాహనదారుల ఇక్కట్లు


గుంతలమయంగా మారిన ముబారక్‌పూర్-ఎల్లకొండ రోడ్డు

నవాబుపేట మండలంలోని ఎల్లకొండ నుంచి ముబారక్‌పూర్, ఏక్‌మామిడి-నవాబుపేట, సాయిబాబా ఆలయం, సాయన్నగూడల మీదుగా ఎల్లకొండకు వెళ్లే రోడ్లు గుంతలమయమై అధ్వానంగా మారాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వివరించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు. **- నవాబుపేట, అక్టోబరు 22**

ఏక్ మామిడి-కేశవపల్లి రోడ్డు దుస్థితి →

